

నెలరోజుల పాటు రోడ్డు భద్రతా మాసోత్సవాలు


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103



సంపుటి - 2 సంచిక - 256 శుక్రవారం 02 జనవరి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


## ఫాస్టాగ్‌లపై వాహనదారులకు భారీ ఊరట

**కార్లు, జీపులు, వ్యాన్ల ఫాస్టాగ్‌లకు కేవైసీ ప్రక్రియను రద్దు చేసిన ఎన్ హెచ్ఏఐ**

**ఫిబ్రవరి 1నుంచి అమల్లోకి రానున్న కొత్త నిబంధనలు**

**ఫిర్యాదులు వస్తే తప్ప పాత ఫాస్టాగ్‌లకు కూడా కేవైవీ అవసరం లేదన్న సంస్థ**

**యాక్టివేషన్‌కు ముందే వాహన్ డేటాబేస్‌తో వివరాల వెరిఫికేషన్**

**ఫాస్టాగ్ జారీ చేసే బ్యాంకులకే పూర్తిస్థాయి ధృవీకరణ బాధ్యత**




**న్యూఢిల్లీ, జనవరి1(జర్నలిస్ట్ వార్త):** జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కార్లు, జీపులు, వ్యాన్‌లకు సంబంధించిన ఫాస్టాగ్‌ల కోసం 'నో యువర్ వెహికల్' ప్రక్రియను రద్దు చేస్తున్నట్లు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ గురువారం ప్రకటించింది.మిగతా 2లో...

## రికార్డు స్థాయిలో జీఎస్టీ ఆదాయం

**2025 డిసెంబరులో రూ.1.74 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లు**

**2024 డిసెంబరుతో పోలిస్తే 6.1 శాతం వృద్ధి నమోదు**

**పన్ను రేట్ల తగ్గింపు ఉన్నప్పటికీ పెరిగిన వసూళ్లు**

**ఫిబ్రవరి 1 నుంచి పొగాకు ఉత్పత్తులపై కొత్త పన్నుల విధానం**




**న్యూఢిల్లీ, జనవరి1(జర్నలిస్ట్ వార్త):** దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతిని సూచిస్తూ వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు మరోసారి ఆశాజనకమైన వృద్ధిని నమోదు చేశాయి. 2025 డిసెంబరు నెలలో జీఎస్టీ ద్వారా ప్రభుత్వానికి రూ.1,74,550 కోట్ల ఆదాయం సమకూరినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం విడుదల చేసిన అధికారిక గణాంకాలు



## పిల్లలను పెంచలేక..

**నంద్యాల జిల్లాలో ముగ్గురు పిల్లలకు విషమిచ్చి తండ్రి ఆత్మహత్య**

**భార్య మరణంతో మనస్తాపం..**

**పిల్లలను పెంచలేక అఘాయిత్యం**

**శీతల పానీయంలో పురుగుల మందు కలిపి ఇచ్చినట్లు అనుమానం**

## రాజకీయ ప్రయోజనాల కోసమే కేసీఆర్ జలవివాదం

**గత ప్రభుత్వం తెలంగాణకు 34 శాతం వాటాకే అంగీకరించి అన్యాయం చేసిందని ఆరోపణ**

**కేసీఆర్, హరీశ్‌ల సంతకాలు తెలంగాణ పాలిట మరణ శాసనం అన్న రేవంత్**

**'నీళ్లు-నిజాలు' పేరుతో ప్రజాభవన్‌లో కాంగ్రెస్ నేతలకు అవగాహన కార్యక్రమం**



హైదరాబాద్, **జనవరి1(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ నీటి హక్కుల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన వైఖరిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాజకీయ ఉనికిని కాపాడుకోవడం కోసమే మాజీ సీఎం కేసీఆర్ ఇప్పుడు జల వివాదాలను మళ్లీ తెరపైకి తెచ్చి, రెండు రాష్ట్రాల మధ్య భావోద్వేగాలను రెచ్చగొడుతున్నారనిమిగతా 2లో...

## రెండేళ్లు గడిచినా హామీల అమలుపై నిర్లక్ష్యం

**కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపాటు**

**బిఆర్ఎస్ డైరీని ఆవిష్కరించిన కెటిఆర్**



హైదరాబాద్,**జనవరి1(జర్నలిస్ట్ వార్త):** క్యాలెండర్లు మారుతున్నాయే తప్ప, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎన్నో ఆశలతో ఓటేసిన ప్రజల జీవితాల్లో మాత్రం ఎలాంటి సానుకూల మార్పు రాలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు.మిగతా 2లో...

## ఓటర్ల జాబితా తనిఖీకి ఏఐ వాడాలి

**ఎన్నికల సంస్కరణలపై ఈసీతో జనసేన ప్రతినిధుల భేటీ**

**ఢిల్లీలో ప్రధాన ఎన్నికల కమిషనర్‌తో చర్చలు**

**పార్టీల నుంచి సూచనలు స్వీకరిస్తున్న ఎన్నికల సంఘం**

**గతంలో పలు సూచనలు చేసిన టీడీపీ**




ఓటర్ల జాబితా తనిఖీకి ఏఐ వాడాలని టీడీపీ ప్రతిపాదన దేశంలో ఎన్నికల ప్రక్రియను మరింత పటిష్టం చేసే లక్ష్యంతో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) రాజకీయ పార్టీలతో జరుపుతున్న సంప్రదింపుల ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా, గురువారం జనసేన పార్టీ ప్రతినిధుల బృందంమిగతా 2లో...

## కూటమి ప్రభుత్వంపై కెసిఆర్ అక్కసు

**చంద్రబాబును అంతా అభినందిస్తే తట్టుకోలేరా**

**కెసిఆర్, జగన్‌ల తీరుపై మండిపడ్డ మంత్రి ఆనం**

నెల్లూరు **జనవరి1(జర్నలిస్ట్ వార్త):** కూటమి ప్రభుత్వం రాకతో రామరాజ్యం ఆరంభమైందని... ఎవరూ అడ్డుకోలేరని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంపై కేసీఆర్ విమర్శలు చేయడం బాధేసిందన్నారు. చంద్రబాబు స్టేట్స్‌మెన్ అని ప్రపంచమంతా కీర్తిస్తుందని.. కేసీఆర్‌కు నచ్చితే ఎంత? నచ్చకుంటే ఎంత? అంటూ మంత్రి వ్యాఖ్యలు చేశారు.

మిగతా 2లో...



## తాగారు.. ఊగారు!

**కొత్త సంవత్సరం సందర్భంగా మందేసి చిందేసిన భారతీయ యువత**





# నేటి నుంచి కొత్త పాస్ బుక్స్

**ప్రైవేట్ పట్టా భూములను జాబితా నుంచి పూర్తిగా తొలగిస్తూ మంత్రి అనగాని తొలి సంతకం**

**మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధుల భూములకు కూడా విముక్తి**

**జనవరి 2 నుంచి కొత్త పాస్‌బుక్‌ల పంపిణీకి శ్రీకారం**

**భూ అక్రమాల నివారణకు ప్రత్యేక యాప్ తీసుకొస్తామని ప్రభుత్వం ప్రకటన**

విజయవాడ **జనవరి1(జర్నలిస్ట్ వార్త):** ఆంధ్రప్రదేశ్‌లోని రైతులు, భూ యజమానులకు కూటమి ప్రభుత్వం నూతన సంవత్సరంలో కీలకమైన శుభవార్త అందించింది. రాష్ట్రంలో రిజిస్ట్రేషన్లకు తీవ్ర ఆటంకంగా మారిన 22ఏ నిషిద్ధ జాబితా నుంచి 5 రకాల భూములను తొలగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ గురువారం తన శాఖలో తొలి సంతకం చేశారు. మంత్రి ఆదేశాల ప్రకారం, ప్రైవేట్ పట్టా భూములను 22ఏ జాబితా నుంచి సంపూర్ణంగా తొలగించారు. ఈ భూములకు సంబంధించి ఎవరైనా దరఖాస్తు చేసినామిగతా 2లో...



# వందేభారత్ స్లీపర్ రైలు సిద్ధం

**గువాహటి - కోల్‌కతా మధ్య తొలి రైలు**

**రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి**



**న్యూఢిల్లీ, జనవరి01:** వందేభారత్ రైలు స్లీపర్ కోచ్‌లో ప్రయాణించాలన్న ప్రయాణికుల కోరిక త్వరలో తీరనుంది. వందే భారత్ స్లీపర్ కోచ్‌లతో కూడిన రైలును ప్రధాని మోదీ చేతుల మీదుగా తర్వలో ప్రారంభించనున్నట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ట్రైల్ రన్, ఇతర పరీక్షలు అన్నీ పూర్తయ్యాయని తొలి స్లీపర్ రైలును గువాహటి-కోల్‌కతా మధ్య నడపనున్నామని ఆయన వివరించారు. మిగతా 2లో...

# పిల్లలను పెంచలేక..

## నంద్యాల జిల్లాలో ముగ్గురు పిల్లలకు విషమిచ్చి తండ్రి ఆత్మహత్య

**నంద్యాల జనవరి 1 (జర్నలిస్టు జర్నీ న్యూస్)**ఏపీలోని నంద్యాల జిల్లాలో గుండెలు పిండేసే విషాద ఘటన చోటుచేసుకుంది. కన్నబిడ్డలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన తండ్రే.. వారి ప్రాణాలను తీసి, తాను కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉయ్యాలవాడ మండలం తుడుమలదిన్నె గ్రామంలో ఈ దారుణం జరిగింది. గ్రామానికి చెందిన వేములపాటి సురేంద్ర (35) తన ముగ్గురు పిల్లలకు విషం ఇచ్చి చంపి, అనంతరం తాను ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం నాడు సురేంద్రతో పాటు పిల్లలు కావ్యశ్రీ (7), జ్ఞానేశ్వరి (4), సూర్య గగన్ (2) మృతదేహాలను ఇంట్లో గుర్తించారు. పిల్లలకు కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలిపి తాగించి, వారు చనిపోయాక సురేంద్ర ఉరివేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సురేంద్ర భార్య మహేశ్వరి అనారోగ్య కారణాలతో 2025 ఆగస్టు 16న ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచి పిల్లల ఆలనాపాలనా సురేంద్ర చూసుకుంటున్నాడు.నిర్మాణ పనులకు వెళ్లే సురేంద్ర.. భార్య మరణంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు, పిల్లలను ఒంటరిగా పెంచలేకపోవడం, మద్యానికి బానిస కావడం వంటి కారణాలతో తీవ్ర ఒత్తిడికి లోనయ్యాడు. ఈ క్రమంలోనే మద్యం మత్తులో ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటాడని స్థానికులు, పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలంలో ఆహారం, కూల్‌డ్రింక్ శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# రికార్డు స్థాయిలో జీఎస్టీ ఆదాయం

(మొదటి పేజి తరువాయి)
2024 డిసెంబరులో నమోదైన రూ.1,64,556 కోట్లతో పోలిస్తే ఇది 6.1 శాతం అధికం కావడం గమనార్హం. పండుగల సీజన్ తర్వాత కూడా దేశంలో ఆర్థిక కార్యకలాపాలు బలంగా కొనసాగుతున్నాయనడానికి ఈ గణాంకాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.డిసెంబర్ నెల వసూళ్లలో సెంట్రల్ జీఎస్టీ (జ+ూ) వాటా రూ.34,289 కోట్లు కాగా, స్టేట్ జీఎస్టీ (ా+ూ) వాటా రూ.41,368 కోట్లుగా ఉంది. ఇక ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ (×+ూ) ద్వారా అత్యధికంగా రూ.98,894 కోట్లు వసూలయ్యాయి. రుణ బకాయిల చెల్లింపుల కోసం తాత్కాలికంగా కొనసాగిస్తున్న జీఎస్టీ పరిహార సెస్ రూపంలో ప్రభుత్వానికి మరో రూ.4,551 కోట్లు అందాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఈ సెస్ ద్వారా మొత్తం రూ.88,385 కోట్లు వసూలయ్యాయి. మరోవైపు, డిసెంబరులో జీఎస్టీ రిఫండుల రూపంలో రూ.28,980 కోట్లను ప్రభుత్వం వెనక్కి చెల్లించింది. కొన్ని విలాసవంతమైన వస్తువులపై 40 శాతం వంటి కొత్త పన్నుల శ్లాబులు ప్రవేశపెట్టినప్పటికీ, పొగాకు, పాన్ మసాలా వంటి వాటిపై సెస్ కొనసాగుతోంది. సెప్టెంబర్ 22 నుంచి కొన్ని వస్తువులపై పన్ను రేట్లు తగ్గించినప్పటికీ, వినియోగదారుల నుంచి డిమాండ్ పెరగడం వల్ల వసూళ్లు పెరగడం విశేషం.పొగాకు ఉత్పత్తులపై కొత్త పన్నుల విధానంఇదే సమయంలో, పొగాకు ఉత్పత్తులపై కొత్త పన్నుల విధానాన్ని అమలు చేసేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం పలు నోటిఫికేషన్లు జారీ చేసింది. ఈ కొత్త నిబంధనలు 2026 ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఇటీవలి పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఆమోదం పొందిన సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) చట్టం-2025 ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. ఈ చట్టం పొగాకు ఉత్పత్తులపై కొత్త ఎక్సైజ్ సుంకం రేట్లను నిర్దేశిస్తుంది. దీనితో పాటు, పాన్ మసాలా తయారీపై సెస్ విధించే హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ యాక్ట్, 2025 కూడా అదే తేదీ నుంచి అమల్లోకి రానుంది.

# ఫాస్టాగ్‌లపై వాహనదారులకు భారీ ఊరట

(మొదటి పేజి తరువాయి)
ఈ కొత్త నిబంధన ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానుంది. ఈ నిర?యంతో లక్షలాది మంది వాహనదారులకు పెద్ద ఊరట లభించనుంది.ఫాస్టాగ్ యాక్టివేట్ అయిన తర్వాత కేవైవీ పేరుతో ఎదురవుతున్న ఇబ్బందులు, జాప్యాన్ని నివారించేందుకే ఈ సంస్కరణ తీసుకొచ్చినట్లు రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వాహనానికి సంబంధించిన సరైన పత్రాలు ఉన్నప్పటికీ, కేవైవీ అప్‌డేట్ కాలేదన్న కారణంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని, తాజా నిర?యంతో ఆ సమస్యలు తొలగిపోతాయని పేర్కొంది.కొత్త ఫాస్టాగ్‌లకే కాకుండా, ఇప్పటికే జారీ చేసిన ఫాస్టాగ్‌లకు కూడా ఈ మినహాయింపు వర్తిస్తుంది. అయితే, ఫాస్టాగ్ దుర్వినియోగం, తప్పుగా జారీ చేయడం వంటి నిర్దిష్ట ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే కేవైవీ అవసరమవుతుందని స్పష్టం చేసింది. ఎలాంటి ఫిర్యాదులు లేని పాత ఫాస్టాగ్‌లకు కేవైవీ తప్పనిసరి కాదు.వినియోగదారులకు ప్రక్రియను సులభతరం చేస్తూనే, వ్యవస్థలో పారదర్శకత, కచ్చితత్వాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టింది. ఇకపై ఫాస్టాగ్ యాక్టివేషన్‌కు ముందే వాహన్ డేటాబేస్ నుంచి వాహన వివరాలను ధ ృవీకరించుకోవాలని బ్యాంకులకు కఠిన నిబంధనలు విధించింది. ఒకవేళ వాహన్ పోర్టల్‌లో వివరాలు లేకపోతే, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ ద్వారా సరిచూసుకున్న తర్వాతే ఫాస్టాగ్‌ను యాక్టివేట్ చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో విక్రయించే ఫాస్టాగ్‌లకు కూడా ఇదే నిబంధన వర్తిస్తుంది. ఈ మార్పులతో వెరిఫికేషన్ బాధ్యత పూర్తిగా బ్యాంకులపైనే ఉంటుందని, వినియోగదారులకు ఇబ్బందులు లేని ప్రయాణ అనుభవాన్ని అందించడమే లక్ష్యమని తెలిపింది.

# నేటి నుంచి కొత్త పాస్ బుక్స్

(మొదటి పేజి తరువాయి)
లేదా చేయకపోయినా, అధికారులే సుమోటోగా చర్యలు తీసుకుని జాబితా నుంచి తొలగించాలని స్పష్టం చేశారు. అదేవిధంగా, సరైన పత్రాలు ఉన్న మాజీ, ప్రస్తుత సైనిక ఉద్యోగుల భూములతో పాటు స్వాతంత్ర్య సమరయోధుల భూములను కూడా ఈ నిషిద్ధ జాబితా నుంచి మినహాయించాలని ఆదేశాలు జారీ చేశారు. మిగిలిన భూములపై త్వరలోనే మంత్రివర్గ ఉపసంఘం (జీవోఎం)లో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ, భూ యజమానుల హక్కులను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని అన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నామని వివరించారు.

# రెండేళ్లు గడిచినా హామీల అమలుపై నిర్లక్ష్యం

(మొదటి పేజి తరువాయి)
గత రెండు సంవత్సరాలుగా రాష్ట్రం అభివృద్ధి వైపు కాదు, తిరోగమనం వైపు ప్రయాణిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణ భవన్‌లో భారత రాష్ట్ర సమితి నూతన సంవత్సర డైరీని కెటిఆర్ ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ ప్రజలకు, భారతదేశ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ 2026 నూతన సంవత్సర సందర్భంగా భావోద్వేగభరిత ప్రసంగం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఉన్న పరిస్థితులు, కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టకముందు ఉన్న దుస్థితి మళ్లీ రాష్ట్రానికి తిరిగి వస్తోందని కేటీఆర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా నేడు పండుగ వాతావరణంలో ఉన్నప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా రైతులు యూరియా కోసం అవస్థలు పడుతున్నారని, చలి కాలంలో కూడా గంటల తరబడి, దినాల తరబడి లైన్లలో నిలబడాల్సిన దయనీయ పరిస్థితి కాంగ్రెస్ పాలనలో మళ్లీ వచ్చిందని విమర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమాన్ని గుర్తు చేస్తూ, కేంద్రంతోనూ సమైక్యవాదులతోనూ 14 ఏళు కేసీఆర్ నాయకత్వంలో సాగిన పోరాటాన్ని కేటీఆర్ స్మరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 10 ఏళ్ల పాటు కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం చరిత్రలో చెరగని ముద్రగా నిలిచిందని, ఆ ప్రగతి సంతకాన్ని ఎవరూ తుడిచిపెట్టలేరని స్పష్టం చేశారు. గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వ దుష్పరిపాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పోరాట స్ఫూర్తితో ముందుకు సాగుతున్నారని కేటీఆర్ కొనియాడారు. జెండాను చేతబట్టి నడిపించే నాయకుల కంటే, ఆ జెండాను భూమిలో నిటారుగా పాతి 'ఇది నా జెండా'అని గర్వంగా చెప్పే కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని కేటీఆర్ పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల నుంచి రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ప్రతి పోరాటం వరకు లగచర్లలో గిరిజనులపై జరిగిన దాడులకు వ్యతిరేకంగా, రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేసిన తీరుకు వ్యతిరేకంగా, రైతుబంధును రెండు సార్లు ఎగ్గొట్టిన అన్యాయంపై, 'ఆరు గ్యారంటీలు ? 420 హామీలు'పై ప్రజా తిరుగుబాటుకు నాయకత్వం వహించిన కార్యకర్తలను కేటీఆర్ అభినందించారు. మూసీ నది పరివాహక ప్రాంతాల్లో జరుగుతున్న దాష్టీకానికి వ్యతిరేకంగా గళమెత్తిన సోదరులను, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో భూముల ఆక్రమణకు నిరసనగా నిలిచిన విద్యార్థులను, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అన్యాయానికి ఎదురు నిలుస్తున్న తెలంగాణ తమ్ముళ్లను, ఆడబిడ్డలను ఆయన ప్రత్యేకంగా స్మరించారు. 2026వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న ఈ శుభసందర్భంలో ఒకటే విషయం గుర్తుంచుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. గెలుపులు, ఓటములు శాశ్వతం కావని, అవి తాత్కాలికమని, అప్పుడప్పుడు ఎదురుదెబ్బలు తగులుతాయని, కానీ తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ స్థానం, గులాబీ జెండా స్థానం మాత్రం శాశ్వతమని స్పష్టం చేశారు. ఇతర పార్టీలకు తెలంగాణ రాజకీయాలు ఒక ఆటలా ఉంటే, తెలంగాణ సాధించిన బీఆర్ఎస్‌కు రాజకీయాలు ప్రజల సంక్షేమానికి సంబంధించిన ధర్మమని, ఒక విధి అని కేటీఆర్ తెలిపారు. గెలుపు-ఓటములతో సంబంధం లేకుండా పార్టీ ప్రయాణం నిరంతరం కొనసాగాలని అన్నారు.

ఈ ఏడాది ఒక వైపు పోరాటాన్ని కొనసాగిస్తూనే, మరో వైపు పటిష్టమైన సంస్థాగత నిర్మాణం కూడా అవసరమని కేటీఆర్ స్పష్టం చేశారు. పోరాటం, నిర్మాణం రెండింటినీ ఆధారంగా చేసుకుని ముందుకు సాగాలని, ధర్మం, న్యాయం, నిజాయితీ తమవైపే ఉన్నాయని, అందుకే విజయం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. కేంద్రం, రాష్ట్రం కలిసి రెండు పార్టీలు ఒక్కటై బీఆర్ఎస్‌పై దాడి చేస్తున్న పరిస్థితి కనిపిస్తున్నప్పటికీ, ప్రజల ఆశీర్వాదం, దైవ ఆశీర్వాదం ఉన్నంతకాలం ఎవరూ ఏమీ చేయలేరని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు జరిగినా బీఆర్ఎస్‌ను అణచివేయడం ఎవరికీ సాధ్యం కాదన్నారు. చివరగా 2028లో తిరిగి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చూడటమే బీఆర్ఎస్ లక్ష్యమని, అదే తమ ధ్యేయమని స్పష్టం చేస్తూ, చిన్నచిన్న ఎదురుదెబ్బలను పెద్దగా పట్టించుకోకుండా జాగ్రత్తగా ముందుకు సాగాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# కూటమి ప్రభుత్వంపై కెసిఆర్ అక్కసు

(మొదటి పేజి తరువాయి)
గురువారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. అలాగే దుర్మార్గమైన పనులతో, నిస్సిగ్గుగా కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రతిపక్షం ఉండటం దురదృష్టకరమని మండిపడ్డారు. నాలుగున్నర దశాబ్దాలుగా ప్రత్యక్ష రాజకీయాల్లో కొనసాగుతున్నామని అన్నారు. 2025లో కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందించిందని.. ప్రభుత్వంలో తానూ భాగస్వామిగా ఉండటం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. నిన్న ఏడాది చివరి రోజు ఆనందంగా గడిచిపోయిందని... చివరి రోజు కూడా మెరుగైన సేవలు అందించామని చెప్పారు. కొందరు నేతలు, అధినాయకులు సోషల్ మీడియాని అడ్డుపెట్టుకుని ప్రభుత్వంపై బురద జల్లాలని చూశారని మండిపడ్డారు. కొత్త సంవత్సరంలో కూడా ప్రజలకు మెరుగైన పాలన అందుతుందని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమ్మ ఒడి ద్వారా రూ.10,090 కోట్లు పంపిణీ జరిగిందన్నారు. స్త్రీశక్తి పథకం కింద మహిళల ఉచిత బస్సు ప్రయాణాలకి రూ.వెయ్యి కోట్లకి పైగా ప్రభుత్వం ఖర్చు చేసిందని తెలిపారు.అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.46 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.6310 కోట్లు జమ చేసిందన్నారు. అలాగే దీపం పథకం - 2 ద్వారా 2 కోట్ల గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇచ్చామని.. ఇందుకోసం ప్రభుత్వం రూ.2684 కోట్లు వెచ్చించిందని తెలిపారు. ఎన్‌టీఆర్ భరోసా ఫించన్లకు గత ఏడాది రూ.33 వేల కోట్లు పంపిణీ చేసిందన్నారు. అన్నా క్యాంటీన్లని గత ప్రభుత్వం రద్దు చేసిందని.. పేద, నిరుపేదలకి ఆహారం లేకుండా చేశారన్ని ÷ర్ అయ్యారు. అన్నా క్యాంటీన్ల ద్వారా 4 కోట్ల మందికి భోజనాలు అందాయని.. త్వరలో గ్రామాల్లోనూ అన్నా క్యాంటీన్లు ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు.

# రాజకీయ ప్రయోజనాల కోసమే కేసీఆర్ జలవివాదం

(మొదటి పేజి తరువాయి)
ఆయన తీవ్రంగా ఆరోపించారు. గురువారం ప్రజాభవన్‌లో ప్రభుత్వం నిర్వహించిన 'నీళ్లు-నిజాలు' కార్యక్రమంలో భాగంగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.కేసీఆర్ ఒక్క సంతకం.. తెలంగాణకు శాపంఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమానికి ప్రధాన పునాది అయిన 'నీళ్లు, నిధులు, నియామకాలు' అనే నినాదాన్ని కేసీఆర్ తన పదేళ్ల పాలనలో పూర్తిగా విస్మరించారని విమర్శించారు. ముఖ్యంగా కృష్ణా జలాల పంపిణీ విషయంలో కేసీఆర్ తీసుకున్న నిర్ణయం తెలంగాణకు 'మరణశాసనం' రాసిందని ఆవేదన వ్యక్తం చేశారు. "ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 811 టీఎంసీల కృష్ణా జలాల్లో, కేవలం 299 టీఎంసీలు మాత్రమే తెలంగాణకు చాలంటూ కేసీఆర్ సంతకం చేశారు. దీనివల్ల ఏపీకి 512 టీఎంసీలు దక్కాయి. ఇది తెలంగాణ రైతుల ప్రయోజనాలను దెబ్బతీయడమే. వాస్తవానికి నదీ పరివాహక ప్రాంతం ప్రకారం తెలంగాణకు 71 శాతం వాటా దక్కాలి. కానీ కేసీఆర్ కేవలం 34 శాతానికి అంగీకరించి రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారు" అని రేవంత్ రెడ్డి గణాంకాలతో వివరించారు. "ఆనాడు ముఖ్యమంత్రిగా కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రిగా హరీశ్ రావు పెట్టిన సంతకాలే తెలంగాణ పాలిట మరణ శాసనంగా మారాయి" అని రేవంత్ రెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు. జూరాల ప్రాజెక్టు విషయంలో వీళ్లిద్దరినీ ఉరి తీసినా తప్పులేదు... ఇలాంటి వాళ్లను మిడిల్ ఈస్ట్ దేశాల్లో అయితే రాళ్లతో కొట్టి చంపుతారని వ్యాఖ్యానించారు. రాజకీయ మనుగడ కోసమే కొత్త డ్రామావరుసగా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘోర పరాజయం పాలవడంతో ఆ పార్టీ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. పార్టీపై పట్టు నిలుపుకోవడం కోసం, ప్రజల దృష్టిని మళ్లించడం కోసమే కేసీఆర్ ఇప్పుడు ఫామ్‌హౌస్ నుంచి బయటకు వచ్చి నీళ్ల పంచాయితీ మొదలుపెట్టారని ఆరోపించారు. ఇందుకోసం ఓ అబద్ధాల ప్రచార బృందాన్ని ఏర్పాటు చేసి కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.గత ప్రభుత్వ వైఫల్యాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 'కృష్ణా, గోదావరి జలాల కేటాయింపులు-వినియోగం' అనే అంశంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గత ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ముఖ్యంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై ఆయన కీలక వివరాలు వెల్లడించారు. "గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం సుమారు రూ. 27,000 కోట్లు ఖర్చు చేసింది. కానీ ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందించలేకపోయింది. కనీస చట్టబద్ధమైన అనుమతులు కూడా లేకుండా పనులు ప్రారంభించి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారు" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. గత పదేళ్లలో నీటిపారుదల రంగంపై బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 1.83 లక్షల కోట్లు ఖర్చు చేసినా, ఆశించిన స్థాయిలో కొత్త ఆయకట్టును సృష్టించలేకపోయిందని, పైగా ప్రాజెక్టుల కోసం రూ. 96,000 కోట్ల అప్పులు చేసి రాష్ట్రంపై తీవ్ర ఆర్థిక భారం మోపిందని ఆయన ఆరోపించారు.జనవరి 2న అసెంబ్లీ సమావేశాలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో, నీటిపారుదల రంగంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి ప్రకటించారు. "కృష్ణా, గోదావరి జలాలపై అసెంబ్లీలో చర్చిద్దాం. దమ్ముంటే కేసీఆర్ చర్చకు రావాలి" అని సవాల్ విసిరారు. తెలంగాణ హక్కుల కోసం ట్రిబ్యునళ్ల వద్ద, చట్టపరంగా తమ ప్రభుత్వం పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు.

# వందేభారత్ స్లీపర్ రైలు సిద్ధం

(మొదటి పేజి తరువాయి)
'చాన్నాళ్లుగా కొత్త జనరేషన్ వందేభారత్ రైళ్ల కోసం ప్రయాణికుల నుంచి డిమాండ్ ఉంది. భారతీయ రైల్వేలో వందేభారత్ చైర్ కార్ రైళ్లతో కొత్త శకం ఆరంభమైంది. ఈ రైళ్లను ప్రజలు కూడా బాగా ఆదరిస్తున్నారు. వేలాది కిలోమీటర్ల దూరం ప్రయాణించే వారిని దృష్టిలో పెట్టుకుని స్లీపర్ కోచ్‌లతో కూడిన వందేభారత్ రైళ్లను రూపొందించాం. అధునాతన భద్రతా ప్రమాణాలతో అంతర్జాతీయ స్థాయి స్లీపర్ కోచ్‌లతో ఈ రైళ్లను సిద్ధం చేశాం' అని వైష్ణవ్ ఢిల్లీలో విలేకరులకు వివరించారు. టికెట్ ధరలు కూడా మధ్యతరగతి ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని నిర్ణయిస్తున్నామని తెలిపారు. గువాహటి-హౌరా మధ్య ప్రయాణానికి 3ఏసీ టికెట్ ధర రూ.2300గా ఉండొచ్చని తెలిపారు. దేశంలో తొలి బుల్లెట్ రైలు ట్రైల్ రన్‌ను 2027 ఆగస్టు 15న నిర్వహిస్తామని వెల్లడించారు. ముందుగా సూరత్-బిలిమోరా మార్గంలో బుల్లెట్ రైలు సిద్ధమవుతుందని ఆయన పేర్కొన్నారు.

# పినపాక గ్రామంలో నూతనంగా నిర్మించిన తెలుగుదేశం పార్టీ దిమ్మెను ప్రారంభించి, జెండా ఎగరవేసిన వాసిరెడ్డి రామనాధం





**తల్లాడ/జనవరి 1(జర్నలిస్ట్ వార్త):**
గ్రామ శాఖ అధ్యక్షుడు తేలుపుట్ల వెంకటేశ్వర్లు సన్మానించిన తెలుగుదేశం పార్టీ నాయకులుతల్లాడ మండలం పినపాక గ్రామంలో నూతనంగా తెలుగుదేశం పార్టీ దిమ్మె ను నిర్మించారు.ఈ దిమ్మె నిర్మాణం కి ఖమ్మం కి చెందిన టీడీపీ నాయకులు వనమా.వాసు 10,000/- రూపాయలు ఖర్చుల నిమిత్తం ఇచ్చినారు.ఈ సందర్భంగా వనమా వాసు మాట్లాడుతూ ప్రతి గ్రామం లో టిడిపి దిమ్మె ఉండలని, గ్రామాల్లో అన్న నందమూరి తారక రామారావు అభిమానులు టీడీపి అబిమానులు ఇంకా చెక్కు చెదరకుండా ఉన్నారు. రానున్న పార్టీ పరంగా నా సేవలు ఉంటాయని తెలియ జేశారు.ఈ కార్యక్రమం కి ముఖ్య అతిథిగా తెలుగుదేశం జిల్లా కన్వీనర్ వాసిరెడ్డి రామనాధం విచ్చేసినారు.నూతనంగా నిర్మించిన దిమ్మె ను ఆవిష్కరించి,తెలుగుదేశం పార్టీ జెండా ఏగర వేసిన జిల్లా తెలుగు దేశం పార్టీ కన్వీనర్ వాసిరెడ్డి రామనాధం,ఈ సందర్భంగా రామనాధం మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల గెలిపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. మండలం లో ప్రతి గ్రామం లో టిడిపి పార్టీ బలోపేతం చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో టిడిపి నాయకులు నర్వనేనిశంకర్రావు, వనమా వాసు, సరికొండ. శ్రీనివాస రాజు, ధూపాటి భద్ర రాజు, రావూరి రవి ప్రసాద్,దుగ్గినేని వెంకటయ్య,వడ్డే నాగేశ్వరావు,కొమ్మినేని. రామయ్య, నారపోగు ప్రసాద్, పోట్రు.రామరావు, సరస్వతి, మందలపల్లి. రజని,ఎండి హాఫీజ్, గ్రామ శాఖ అధ్యక్షుడు తేలపుట్ల. వేంకటేశ్వర్లు, నల్లమోతు.సత్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా తనిఖీకి ఏఐ వాడాలి

(మొదటి పేజి తరువాయి)
ఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో ఈసీ ఉన్నతాధికారులతో సమావేశమైంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, కమిషనర్లు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషి ఈ సమావేశంలో పాల్గొన్నారు. జనసేన తరపున పార్టీ ప్రతినిధులు ఇ. ప్రతాప్ కుమార్, ఆర్.ఎం.వి. సుమంత్ హాజర్రై, ఎన్నికల సంస్కరణలపై తమ పార్టీ తరపున పలు సూచనలు అందజేశారు. అయితే, ఈసీకి సమర్పించిన ప్రతిపాదనల వివరాలను జనసేన పార్టీ అధికారికంగా వెల్లడించలేదు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని జనసేన, రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలోని అధికార కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న విషయం తెలిసిందే.ప్రస్తుతం ఉన్న చట్టపరమైన నిబంధనల పరిధిలోనే ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేసేందుకు, దేశంలోని గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర స్థాయి పార్టీల నుంచి ఈసీ సూచనలు స్వీకరిస్తోంది. 2025 మార్చిలోనే ఈ ప్రక్రియను ప్రారంభించిన ఎన్నికల సంఘం, అన్ని పార్టీల అధ్యక్షులు, సీనియర్ నేతలతో సమావేశమై వారి అభిప్రాయాలు తెలుసుకోవాలని నిర్ణయించింది. క్షేత్రస్థాయిలో ఎన్నికల అధికారులతో పార్టీలు మరింత చురుకుగా పనిచేయాలని కూడా ఈసీ కోరుతోంది.ఇదే క్రమంలో, గత ఏడాది జులైలో తెలుగుదేశం పార్టీ (టీడీపీ) ప్రతినిధుల బృందం కూడా ఈసీని కలిసి తమ సూచనలను సమర్పించింది. ఓటర్ల జాబితాలో పారదర్శకత, కచ్చితత్వాన్ని పెంచేందుకు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) పర్యవేక్షణలో ఏటా థర్డ్-పార్టీ ఆడిట్ నిర్వహించాలని టీడీపీ ఆనాడు ప్రతిపాదించింది. జాబితాలోని అవకతవకలను గుర్తించేందుకు ఇది దోహదపడుతుందని వివరించింది. ఆంధ్రప్రదేశ్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను ముందుగానే ప్రారంభించాలని కోరింది.అంతేకాకుండా, ఓటరు పేరును జాబితా నుంచి తొలగించాల్సి వస్తే, సరైన కారణాలతో కూడిన ఉత్తర్వులు జారీ చేయాలని, సంబంధిత ఓటరుకు ముందస్తు నోటీసు ఇచ్చి వివరణ తీసుకునే అవకాశం కల్పించాలని టీడీపీ స్పష్టం చేసింది. ఓటర్ల జాబితా నిర్వహణలో నకిలీలు, వలస వెళ్లిన వారు, మరణించిన వారి వివరాలను రియల్ టైంలో గుర్తించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత టూల్స్‌ను వినియోగించాలని కూడా సూచించింది. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న టీడీపీ తరఫున, పార్లమెంటరీ పార్టీ నేత లావు కృష్ణ దేవరాయలు ఈ సూచనల లేఖను సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు అందజేశారు. తాజాగా టీడీపీ మిత్రపక్షమైన జనసేన కూడా తమ వంతు ప్రతిపాదనలు అందించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# న్యూ ఇయర్ వేడుకలు చర్చిల్లో ఆధ్యాత్మిక సందడి

## మంచి జీవితం కోసం విశేష ప్రార్థనలు -ప్రేమసేవే నిజమైన మార్గం ఫాదర్ జోజి బాబు





**వరంగల్ ఉమ్మడి జిల్లా/బ్యూరో1(జర్నలిస్ట్ వార్త)**నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వరంగల్ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. న్యూ ఇయర్ సందర్భంగా విశ్వాసులు కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద సంఖ్యలో చర్చిలకు తరలివచ్చారు. గత ఏడాది ఎదురైన కష్టాలు, బాధలను తలచుకుంటూ, రాబోయే సంవత్సరం శాంతి, సుఖసంతోషాలు, ఆశలు, విజయాలతో నిండాలని దేవునిని వేడుకున్నారు. చర్చిలన్నీ భజనలు, ప్రార్థనలు, బైబిల్ పఠనాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.నూతన సంవత్సరం తొలి గంటల నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, ధ్యాన కార్యక్రమాలు కొనసాగాయి. విశ్వాసులు తమ కుటుంబాల సంక్షేమం, పిల్లల భవిష్యత్, ఆరోగ్యం, ఉపాధి అవకాశాల కోసం ప్రార్థనలు చేశారు. కొత్త సంవత్సరం మంచి మార్గాన్ని చూపాలని, జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావాలని దేవునిని వేడుకున్నారు.ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా ధర్మసాగర్ రోమన్ క్యాథలిక్ చర్చిలో ఫాదర్ జోజి బాబు ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితంలో ఆశలు, మార్పులు తీసుకురావాలని ఆకాంక్షించారు. మంచి జీవితం గడపాలంటే ప్రేమ, సహనం, క్షమాశీలత, సేవాభావం అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత స్వార్థాన్ని విడిచిపెట్టి సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు.ప్రత్యేక ప్రార్థనల్లో కుటుంబ సంక్షేమం, యువతకు మంచి భవిష్యత్, ఉద్యోగావకాశాలు పెరగాలని, రైతులకు పంటలు సమృద్ధిగా పండాలని విశ్వాసులు ప్రార్థించారు. పేదలు, అనాథలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి దేవుని కృప లభించాలని వేడుకున్నారు. దేశంలో శాంతి భద్రతలు నెలకొని, ప్రజలంతా ఐక్యతతో జీవించాలని ఆకాంక్షించారు.చర్చిల్లో నిర్వహించిన బైబిల్ పఠనాలు, ప్రత్యేక సందేశాలు, భజన కార్యక్రమాలు విశ్వాసుల్లో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని పెంచాయి. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఆనందంగా గడిపారు. మొత్తం మీద వరంగల్ ఉమ్మడి జిల్లాలో న్యూ ఇయర్ సందర్భంగా జరిగిన ఈ ఆధ్యాత్మిక వేడుకలు ప్రజల్లో మంచి జీవితం గడపాలనే సంకల్పాన్ని మరింత బలపరిచాయని పలువురు పేర్కొన్నారు.

# గ్రామ అభివృద్ధికి కృషి చేసి ప్రజల మెప్పును పొందాలి





## -ఈగ మల్లేశం

**వర్ధన్నపేట/జనవరి1(జర్నలిస్ట్ వార్త):**
నూతనంగా ఎన్నికైన సర్పంచులు గ్రామ అభివృద్ధికి కృషి చేసి ప్రజల మెప్పును పొందాలని అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ పూర్వ అధ్యక్షులు,కేంద్ర ఖాధీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు.గురువారం వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్ లో పద్మశాలి కులస్తుల ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్ బేతి సాంబయ్య, వారి పాలకవర్గానికి ఆత్మీయ అభినందన సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ పూర్వ అధ్యక్షులు,కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ముఖ్య అతిథిగా హాజరై గ్రామపంచాయతీ పాలకవర్గానికి మరియు చెన్నారం గ్రామ సర్పంచ్ సిందం లలిత లక్ష్మీనారాయణ, గ్రామ ప్రజలకు నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బేతి సాంబయ్య, ఉపసర్పంచ్ బొచ్చు జ్యోతి యాదగిరి,చెన్నారం గ్రామ సర్పంచ్ లలిత లక్ష్మీనారాయణ తో పాటు వార్డు సభ్యులకు ఈగ మల్లేశం శాలువాలు కప్పి ఘనంగా సన్మానం చేశారు.అనంతరం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ప్రచురించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను పద్మశాలి సంఘం నాయకులతో కలిసి ఈగ మల్లేశం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, ప్రభుత్వం అందించే పలు సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజల దరికి చేరే విధంగా పాటుపడాలన్నారు. ప్రజా ప్రతినిధులు కలిసికట్టుగా ఐక్యమత్యంతో కార్యాచరణ ప్రణాళికతో పని చేసిగ్రామాభివృద్ధికి బాటలు వేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రామారావు, వందేమాతరం రవీందర్, ఇల్లంద గ్రామ పద్మశాలి సంఘం కుల పెద్దలు, సంఘం సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి సేవలను సద్వినియోగం చేసుకోవాలి

## .గ్రామ సర్పంచ్ జోగు సంపత్ కుమార్.

## -అంగన్వాడి సెంటర్ 2 లో ఘనంగా అన్నప్రాసన కార్యక్రమం.

## నూతన సర్పంచ్ ను సన్మానించిన అంగన్వాడి టీచర్ సువర్ణ





**స్టేషన్ ఘన్ పూర్/జనవరి1 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వం అందిస్తున్న అంగన్వాడి సేవలను ప్రతి ఒక్క రు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ జోగు సంపత్ కుమార్ అన్నారు. మండలంలోని మీదికొండ గ్రామంలో గల అంగన్వాడి సెంటర్ 2 ఆధ్వర్యంలో అంగన్వాడి టీచర్ వేల్పుల సువర్ణ అధ్యక్షతన అన్నప్రాసన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ జోగు సంపత్ కుమార్ హాజరై అన్న ప్రాసన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ గర్భిణీలు బాలింతలు, చిన్నారులు అంగన్వాడి సెంటర్ల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్ జోగు సంపత్ కుమార్ ను, ఉపసర్పంచ్ ఆలకుంట్ల శ్రీనివాసును, వార్డు సభ్యులను అంగన్వాడి టీచర్ వేల్పుల సువర్ణ శాలువాలతో ఘనంగాసన్మానిం చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పొన్నం పారిజాతం,జోగు వినయ్, జోగు రాజేష్, బ్లాక్ కాంగ్రెస్ ఇన్చార్జి నాగరబోయిన శ్రీరాములు, నాయకులు కేశరాజు నరహరి, జోగు యాదగిరి, ఏఎన్ఎం కవిత, ఆశా కార్యకర్తలు జే రజిత,జి రజిత,ఎస్ పుష్ప, గ్రామ పెద్దలు వేల్పుల పోతరాజు, చిలువేరు వెంకటయ్య, గర్భిణీలు, బాలింతలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.



# తాటి చెట్టు పైనుండి కింద పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు.

**బయ్యారం/జనవరి 1(జర్నలిస్ట్ వార్త)**
మండల కేంద్రంలో తాడిచెట్టు పై నుండి మోకు జారి గురువారం గీత కార్మికుడు కింద పడి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు.వారు తెలిపిన వివరాల ప్రకారం కాకతీయ నగర్ కు చెందిన ఆకుల కనకయ్య (68) రోజు మాదిరిగానే కుప్పాల బండ సమీపంలో తాడిచెట్టు ఎక్కి కల్లు గీసే సందర్భంలో మోకుజారి కింద పడి తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్సులో మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.తన ఆరోగ్య పరిస్థితి పై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# ధర్మసాగర్ ఫైరింగ్ రేంజ్‌లో కాల్పుల శిక్షణ జనవరి 2, 3 తేదీల్లో ప్రజలకు నిషేధం



**ధర్మసాగర్/జనవరి1 (జర్నలిస్ట్ వార్త):**
టీజీఎస్‌పీఎఫ్ ఆదేశాల మేరకు 20252026 సంవత్సరానికి సంబంధించి వరంగల్ గార్డ్స్‌కు చెందిన టీజీఎస్‌పీఎఫ్ యూనిట్ ఆధ్వర్యంలో వార్షిక కాల్పుల శిక్షణ నిర్వహించనున్నారు.ఈ శిక్షణ కార్యక్రమం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని ముప్పారం కస్తూర్బా పాఠశాల పక్కన ఉన్న గుట్టల వద్ద ఉన్న ధర్మసాగర్ పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో జనవరి 2, 3 తేదీల్లో జరగనుంది.కాల్పుల శిక్షణ జరుగనున్న నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా ఫైరింగ్ రేంజ్ చుట్టుపక్కల ప్రాంతాల్లో వ్యవసాయదారులు, గ్రామస్థులు, సాధారణ ప్రజలు ఎవరూ ఆ వైపుకు వెళ్లవద్దని పోలీసులు సూచించారు.ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసు శాఖకు సహకరించాలని ధర్మసాగర్ ఇన్స్పెక్టర్ కె. శ్రీధర్ రావు తెలిపారు.

# గాంధీనగర్ లో మెగా క్రికెట్ టోర్నమెంట్

## ఈనెల 4న ప్రారంభమయ్యే టోర్నీ కరపత్రం ఆవిష్కరణ



**భీమదేవరపల్లి/జనవరి1 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గాంధీనగర్ గ్రామంలో ఈనెల 4 ఆదివారం నుంచి మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. గురువారం గాంధీనగర్ సర్పంచ్ లక్ష్మారెడ్డి టోర్నమెంట్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ నేడు యువత ఆత్మస్థైర్యం కోల్పోయి తీవ్ర మానసిక ఒత్తిడికి గురై డ్రగ్స్ ఆన్లైన్ గేమింగ్ మద్యంకు బానిసై ఆత్మహత్య చేసుకుంటున్న పరిస్థితులలో క్రీడల వైపు యువతను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఒకవైపు అతివేగంతో వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల్లో మరణించి వారి కుటుంబాల్లో తీవ్ర నిరాశను దుఃఖాన్ని మిగిల్చుతున్న పరిస్థితి ఉందన్నారు. యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంచి వారిలో మనోధైర్యాన్ని క్రీడా స్ఫూర్తిని నింపాలన ఉద్దేశంతో ఈ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువతలో మార్పు కోసం చేసే ఈ ప్రయత్నంలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ సర్పంచ్ కేతిరి లక్ష్మారెడ్డి, నిర్వాహకులు సీనియర్ క్రీడాకారులు, వార్డు సభ్యులు తాళ్లపల్లి కుమారస్వామి, మాజీ వార్డు సభ్యులు తాళ్లపల్లి రమేష్, తాళ్లపల్లి అశోక్, నిర్వహణ కమిటీ సభ్యులు తూముల అరవింద్, తాళ్లపల్లి ప్రసాద్, తాళ్లపల్లి అరవింద్, తాళ్లపల్లి విక్రమ్, తాళ్లపల్లి ఉదయ్ కిరణ్, తాళ్లపల్లి సంపత్, తాళ్లపల్లి బిన్ను తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసిన నాయకులు

## ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన నీల సోమన్న



**స్టేషన్ ఘన్ పూర్/జనవరి1 (జర్నలిస్ట్ వార్త) :** తెలంగాణ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని హైదరాబాదు లోని మినిస్టర్ క్వార్టర్స్ లో గురువారం స్టేషన్ ఘన్పూర్ మత్య సొసైటీ చైర్మన్ నీల సోమన్న, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నీల వెంకటేశ్వర్లు మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు నీల వెంకటేశ్వర్లు తో పాటు గాండ్ల రాజు, నీల సోమన్న, గట్టు శరత్, తాటికొండ వినయ్, అదిమల్ల చింతల్, నీల వీరాస్వామి కలిసి శుభాకాంక్ష లు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కామ్రేడు తుడుం రామయ్య వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు.



**బయ్యారం/జనవరి 1(జర్నలిస్ట్ వార్త):**బయ్యారం మండల కేంద్రంలో కామ్రేడు తుడుం రామయ్య వర్ధంతి సందర్భంగా గడ్డం వెంకట్రామయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన చిత్రపటానికి,రామన్న స్తూపం వద్ద సిపిఐ ఎం ఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు రామగిరి బిక్షం,తుడుం వీరభద్రం మాట్లాడుతూ 2003 జనవరి 1న 23 సంవత్సరాల క్రితం ప్రజా ప్రతిఘటన మాఫియా ముఠా చేతిలో అతికిరాతకంగా హత్య గావించబడిన కామ్రేడ్ రామన్న నూతన సంవత్సరం సందర్భంగా యువకులు మందులు వద్దు చిందులు వద్దు అనే ఆలోచనతో యువకులు స్నేహపూర్వత సంబంధాలు కలిగి ఉండాలని క్రీడలు నిర్వహించే దాంట్లో ముందు ఉండేవాడని,అంతేకాకుండా ఈ దోపిడి వ్యవస్థ నిర్మూలించాలనేటువంటి లక్ష్యంతో పేద ప్రజలను యువకులను చైతన్య పరుస్తూ సమాజ మార్పు కోసం నిరంతరం పనిచేసేవాడని ఓర్వలేని అరాచకవాదులు ఆయనను హత్య చేయడం పార్టీకి తీరని లోటన్నారు.కామ్రేడ్ రామన్న ఏ ఆశయాల కోసం అయితే పనిచేశాడో అందరం అయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడం కోసం నిరంతరం జరిగే ఎటువంటి ఉద్యమాలలో భాగస్వామ్య నవ్వాలని వారన్నారు.ఈ కార్యక్రమంలో ఏపూరి వీరభద్రం,నేతకాని రాకేష్,కొదుమూరి నాగేశ్వరరావు,బిరెడ్డి సంఘున్న, వీరబోయిన ఐలయ్య,కూనూరు యుగంధర్,మహేష్,పొన్నం రమేష్, పొన్నం శ్రీను,శేషు,జనక లక్ష్మీనారాయణ,మట్టే రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన శుభాకాంక్షలు తెలిపిన బయ్యారం సర్పంచ్ గుగులోత్ శాంతి



**బయ్యారం/జనవరి 1(జర్నలిస్ట్ వార్త):**బయ్యారం మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బయ్యారం గ్రామ పంచాయతీ పాలకవర్గం సర్పంచ్, గుగులోత్ శాంతి, ఉపసర్పంచ్ ఏనుగుల ఉమాబయ్యారం మండల కాంగ్రెస్ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నూతన సంవత్సర కేక్ కట్ చేసి బయ్యారం గ్రామ ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు నూతన సంవత్సరశుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా సర్పంచ్ శాంతి మాట్లాడుతూ సర్పంచ్ గా ఆశీర్వదిస్తూ నాకు ఓటు వేసిన గ్రామ ప్రజలకు, గెలుపు కోసం శ్రమించిన కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు నూతన సంవత్సరశుభాకాంక్షలు తెలుపుతూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాక్షించారు, ఈ కార్యక్రమంలోవార్డు సభ్యులు, ఎట్టి సరిత, శీలం సరోజన,పెద్దిని శాంతి, బానోత్ అజయ్, బట్టు ఉమారాణి,రేలా ఇందిరా, నందిపాటి బవాణి,నలాబోలు లీలావతి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంబాల ముసలయ్య,మహబూబాబాద్ పార్లమెంట్ లీగల్ సెల్ గుగులోత్ కిషన్ నాయక్,జిల్లా కార్యదర్శి వీరారెడ్డి, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేలా ఆగిరెడ్డి,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి,పోశం వెంకటేశ్వర్లు,నామబాబురావ్, పెద్దిని వెంకటేశ్వరరావు ఆకునూరు సూర్యనారాయణ, బీరెడ్డి శ్రీనివాస్, నంది పాటి బవాణి, చెరుకుపల్లి వెంకన్న,ఆకునూరి సూర్యనారాయణ, రామగిరి వెంకటేశ్వర్లు, తాటి జనార్ధన్,పుట్టగుంట సత్తిబాబు,బండారుమల్లయ్య, నాద్దునూరి లింగయ్య, చింతకుంట్ల వెంకట్ రెడ్డి,పులి మల్లయ్య, రామగిరి వెంకటేశ్వర్లు పెద్ద బుజ్జి,ఏచ్చు సతీష్, బీరెడ్డి శ్రీనివాస్, ప్రమోద్, తగిర వెంకట్ రెడ్డి,బండి యాదగిరి, కత్తిఎ రాధాకృష్ణ, పందిరి విద్యాసాగర్,పులి మల్లయ్య, పెద్ద బుజ్జి,నాద్దునూరి లింగయ్య,తదితరులు పాల్గొన్నారు

# ఆపన్నాస్తాలకై ఎదురుచూపులు

## ఆర్థిక సమస్యల్లో ఉన్న కుటుంబం

**తల్లాడ/జనవరి1(జర్నలిస్ట్ వార్త):**అన్నారుగూడెం గ్రామం తల్లాడ మండలం ఖమ్మం జిల్లా వాస్తవ్యులు ఇనపనూరు యాకోబు వైఫ్ ఆఫ్ స్వాతి వీరి కుటుంబం గత కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు ఏసోబు అనే వ్యక్తి కొంతకాలంగా తలకి గాయం అవ్వడం వలన తన యొక్క చేతికి కాలుకి పక్షపాతం వచ్చింది తన యొక్క భార్యకి చెవి సమస్య ఉంది ఇప్పుడు పరిస్థితి పని చేసుకుంటేనే బ్రతుకు తెరువు కుటుంబాన్ని పనిచేసే నడిపించే వ్యక్తి పడిపోతే ఒక కుటుంబంలో ఎన్నో ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఎవరైనా పెద్ద మనసుతో దాతలు సహాయం చేసి ఆర్థికంగా అన్ని విధాలుగా వారిని ఆదుకోవాలని వారు మనవి చేసుకున్నారు. మీ యొక్క కుటుంబాన్ని మీ వంతు సహాయం చేయగలరని వారు వేడుకుంటున్నారు. ఈ కుటుంబానికి అండగా ఉంటారని వారు చేతులు జోడించి మిమ్మల్ని వేడుకుంటున్నారు

సహాయం చేసేవారు సంప్రదించవలసిన

చిరునామా cell. 7396480844.



## మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాం రెడ్డి, చైర్మన్ విజయ్ బాబుకు శుభాకాంక్షలు తెలిపిన నారపోగు వెంకట్





**తల్లాడ/జనవరి1(జర్నలిస్ట్ వార్త):** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని గురువారం తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ నేత నారపోగు వెంకట్ పలువురు ప్రముఖులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి, ఇరిగేషన్ డెవలప్మెంట్ చైర్మన్ మువ్వా విజయ్ బాబులను హైదరాబాదులోని సెక్రటేరియట్ లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారికి ఆయన బొకే, పుష్పగుచ్ఛం అందించి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారితో ఆయన కొద్దిసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట అభిరామ్ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ విలాసాగరం అభిరామ్, చార్టర్ అకౌంటెంట్ విలాసాగరం నంద కిషోర్, కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల యువజన విభాగం నాయకులు ఇస్నపల్లి రాజశేఖర్, కాంగ్రెస్ నాయకులు రావూరి దేవ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



**రాయపర్తి/జనవరి 1(జర్నలిస్ట్ వార్త):**మండలంలోని వాంకుడోత్ తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కునుసోత్ రమేష్ అనారోగ్యంతో మరణించగా ఆయన పార్థివ దేహానికి గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హామ్యా నాయక్,టిపిసిసి మాజి కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి, పూల మాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఏఎంసి వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, మాచర్ల ప్రభాకర్,పెండ్లి మహేందర్ రెడ్డి,ఇల్లందుల యాకయ్య,మహేందర్,పిరని ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు2026 వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**భూపాలపల్లి /జనవరి1(జర్నలిస్ట్ వార్త):**జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు2026 సందర్భంగా భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, జిల్లా రవాణా అధికారి (ఋా) తదితరులు పాల్గొన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు 01.01.2026 నుండి 31.01.2026 వరకు నిర్వహించనున్న నేపథ్యంలో, రోడ్డు భద్రత నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నిర్లక్ష్యం, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగం లేకపోవడం వంటి కారణాల వల్ల జరుగుతున్నాయని తెలిపారు. రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి వాహనదారుడు, ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించినప్పుడే ప్రమాదాలను తగ్గించవచ్చని అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోతవాల సందర్భంగా జిల్లా పోలీసు శాఖతో పాటు రవాణా శాఖ అధికారులు సమన్వయంతో నెల రోజుల పాటు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వాహనదారులకు సలహాలు, సూచనలు ఇవ్వడం, విద్యాసంస్థలు, గ్రామాలు, పట్టణాల్లో ప్రచార కార్యక్రమాలు, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు.ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ, తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడుకోవాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్ట్ శాఖ అధికారులు, పోలీస్ అధికారులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి నగదు అందజేత



**గణపురం /జనవరి1(జర్నలిస్ట్ వార్త):**గణపురం మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన కాకతీయుల కాలం నాటి శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆలయంలో అర్చకులు ముసునూరు నరేష్ ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు పూజ అనంతరం గణపురంమండలంలోని కొత్తపల్లి గ్రామ వాస్తవ్యులు శ్రీ మాచర్ల నిర్మల సాంబయ్య దంపతులు ఆలయ అభివృద్ధిలో భాగంగా శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయానికి 10116 రూ నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ కు అందజేయడం జరిగింది కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండారు శంకర్ మూలా శ్రీనివాస్ గౌడ్ బటిక స్వామిమాదాసు అర్జున్ మాదాసు మొగిలి బూర రాజగోపాల్ మోటపోతుల రాజన్న గౌడ్ పాండవుల భద్రయ్య దయ్యాల భద్రయ్య ఉయ్యాల బిక్షపతి గోరంట్ల రాజన్న గుప్తా పాల్గొన్నారు.

# రైతులకు సరిపడా యూరియా నిల్వలు.

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం బ్యూరో/జనవరి1(జర్నలిస్ట్ వార్త);**
జిల్లాలో అందుబాటులో 13 వేల 453 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ యూరియా కొరత ఉంది అనే దుష్ప్రచారాలను రైతులు నమ్మవద్దులియూరియా స్టాక్ పై పత్రిక ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్సాగు చేసే రైతులకు సరిపడా యూరియా స్టాక్ జిల్లాలో అందుబాటులో ఉందని, రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.రైతులకు సకాలంలో యూరియా పంపిణీ చేసేందుకు అన్ని మండలాల్లో సమగ్ర చర్యలు చేపట్టామని, మార్క్ ఫెడ్ ద్వారా యూరియా నిల్వలను ప్యాక్స్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు), ప్రైవేట్ డీలర్లకు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని అన్నారు.ప్రస్తుతం మన ఖమ్మం జిల్లాలో 13 వేల 453 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ అందుబాటులో ఉందని, ఇప్పటివరకు రైతులకు 22 వేల 472 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసినట్లు కలెక్టర్ తెలిపారు. యూరియా పంపిణీ సంబంధిత అంశాలలో రైతులు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, జిల్లా యంత్రాగం, జిల్లా వ్యవసాయశాఖ యూరియా సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తోందని, ఎటువంటి సమస్యలు ఉన్నా, మీ మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారి దృష్టికి తీసుకుని రావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# నూతన ట్రాక్టర్ ను ప్రారంభించిన యాదవ రెడ్డి



**రాయపర్తి/డిసెంబర్ 1(జర్నలిస్ట్ వార్త):**మండలంలోని మైలారం గ్రామంలో బిఆర్ఎస్ మండల పార్టీ నాయకులు లేతాకుల రంగా రెడ్డి నూతన ట్రాక్టర్ ను ఫౌండేషన్ చైర్మెన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి తండ్రి పరుపాటి యాదవ రెడ్డి బి ఆర్ ఎస్ నాయకులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి,మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు,మండల పార్టీ అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోష్ గౌడ్,గజవెల్లి ప్రసాద్, ఆశ్రఫ్ పాషా, సంకినేని ఎల్లస్వామి, కోలా సంపత్, చందు లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

# సెల్ షాప్ ను ప్రారంభించిన

## మాజీ సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి.



**బయ్యారం/జనవరి 1(జర్నలిస్ట్ వార్త):**బయ్యారం మండల కేంద్రంలో ప్రశాంత్ సెల్ వరల్డ్ సెల్ షాపును బయ్యారం సోసైటీ మాజీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి గురువారం ప్రారంభించారు.నూతన సంవత్సరం సందర్భంగా కొత్త సెల్ షాపును అంబేద్కర్ కాలనీకి చెందిన ప్రశాంత్ సెల్ షాప్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా మాజీ సోసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి విచ్చేసి రిబ్బన్ కటింగ్ చేసి షాప్ ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో తిరుమల ప్రభాకర్ రెడ్డి,సూరం సుధాకర్ రెడ్డి,సిపిఎం అంగిరేకుల నాగేశ్వరరావు,తమ్మిశెట్టి వెంకటపతి, చెరుపల్లి నరసయ్య,బరిగల ఉపేందర్, సంపగి వెంకన్నపోతురాజు అలెగ్జాండర్,మబ్బు ప్రశాంత్,నెమలి రఘు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రామాలయ అర్చకులు



**గణపురం /జనవరి1(జర్నలిస్ట్ వార్త);**ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ జన్మదిన సందర్భంగా ములుగు జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఘనపురం రామాలయ అర్చకులు ముసునూరి నరేష్, సీనియర్ జర్నలిస్ట్ గట్టు రవీందర్ గౌడ్, బొల్లం అభిలాష్ లు శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ గణపురం మండల యోగక్షేమాలు, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు.

## నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేసిన ఉపసర్పంచ్ బోడ శ్రీను



**తల్లాడ/జనవరి1(జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలోవెంగన్నపేట ప్రజల అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షల తెలిపారు ఉపసర్పంచ్ బోడ శ్రీను ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ భగవంతుని ఆశీస్సులతో ఆయురారోగ్యాలు కలిగి మన కుటుంబాలలోఈ నూతన సంవత్సరం ఆనందకరగా , ఆహ్లాదకర మైన రోజులు వుండాలని, సుఖ సంతోషాలతో నిండిన మంచి జీవితాన్ని అందించాలని, ఉప సర్పంచ్ బోడా శ్రీను నాయక్ గ్రామ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

# టి ఆర్ పి ఎస్ మండల అధ్యక్షులుగా రామకృష్ణ



**గణపురం /జనవరి1(జర్నలిస్ట్ వార్త):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులుగా పాసికంటి రామకృష్ణను నియమించినట్లు జిల్లా అధ్యక్షులు ఎలగొండ రాజేంద్రప్రసాద్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వల్లకాటి రాజకుమార్ సూచనల మేరకు గణపురం మండల అధ్యక్షులుగా రామకృష్ణను నియమించడం జరిగిందని ఈ నియామకం వెంటనే అమలులోకి వస్తుందని తెలిపారు.

## భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో

# నూతన సంవత్సర వేడుకలు

**-జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్.**





**భూపాలపల్లి/ జనవరి1(జర్నలిస్ట్ వార్త):** భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతన సంవత్సరం2026 వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ గారు పోలీస్ సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు. పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు నూతన సంవత్సరంలో ఆరోగ్యంతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆయన మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించడమే పోలీస్ విధి అని పేర్కొంటూ, సీనియర్ అధికారులుగా ప్రజల అంచనాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. సమాజంలో మంచి, చెడు వ్యక్తులు ఉన్నప్పటికీ, నిర్దోషులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బంది పెట్టకుండా చట్టబద్ధంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లు ఎదురైనా, వాటిని సమర్థంగా అధిగమించడంలో సిబ్బంది అందరూ సమష్టిగా సహకరించారని ప్రశంసించారు. గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా టీమ్‌వర్క్‌తో, ఒక కుటుంబంలా ఐక్యతతో, పూర్తి కమిట్‌మెంట్‌తో విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్ గారు, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, వర్షికల్ డీఎస్పీ నారాయణ, సీఐలు, ఆర్ఐలు, అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, డీపీఓ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## మదర్ థెరిస్సా సేవా సదనము లో నూతన సంవత్సరం సందర్భంగా నూతన వస్త్రములు బహూకరణ అన్న వితరణ





**మధిర/జనవరి1(జర్నలిస్ట్ వార్త):** సామాజిక సేవకులు, నిరాడంబరత కల, పుల్లఖడం చంద్రశేఖర్ ఆర్థిక సహకారంతో మదర్ థెరిస్సా సేవాసదనము మానసిక దివ్యాంగ పిల్లలకు నూతన సంవత్సరం సందర్భంగా నూతన వస్త్రులు అన్న వితరణ చేసినారు. పుల్లఖండం చంద్రశేఖర్ కి నూతన సంవత్సర శుభాకాంక్షలు మీరు మీ కుటుంబ సభ్యులు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని మీరు చేస్తున్న వ్యాపారంలో మరింత అభివృద్ధి చెందాలని కోరుకుంటూ మానసిక దివ్యాంగ పిల్లల తరపున దేవుని ప్రార్థిస్తున్నామనీ మన్నారు. ఈ నూతన వస్త్రులు అన్న వితరణ కార్యక్రమంలో సామాజిక సేవకులు విశ్రాంత ఎంపీడీవో మాధవరపు నాగేశ్వరావు, కోలా శ్రీనివాసరావు పాల్గొన్నారు. పుల్లఖండం చంద్రశేఖర్ నూతన సంవత్సరంను మానసిక దివ్యాంగ పిల్లలతో పంచుకుంట్టూ వారికి నూతన వస్త్రములు, అన్న వితరణ చేసినందుకు మీకు హృదయపూర్వక ధన్యవాదములు కృతజ్ఞతలు తెలిపారు.ఐ

# నూతన సంవత్సరంలో ప్రతి కుటుంబంలో అభివృద్ధి కాంతులు వెల్లి విరియాలి

**ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ కాప మురళీకృష్ణ- ఘనంగా పుష్పలత జన్మదిన వేడుకలు నిరుపేద మహిళకు కుట్టు మిషన్ అందజేత**




**వైరా/జనవరి1(జర్నలిస్ట్ వార్త):** నూతన సంవత్సరంలో ప్రతి కుటుంబంలో అభివృద్ధి కాంతులు వెల్లి విరియాలని డాక్టర్ కాప మురళీకృష్ణ ఆకాంక్షించారు. వైరాలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యురాలు పదిమల పుష్పలత జన్మదిన వేడుకలు సాయిబాబా మందిరంలో నూతన సంవత్సరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుపేద మహిళ అయినఐదో వార్డుకు చెందిన కుల్సంబికి వైరా లయన్స్ క్లబ్ అధ్యక్షులు వై. బుచ్చి రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ చేతుల మీదుగా కుట్టు మిషన్ ను గురువారం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ జీవన ఉపాధి కోసం కుట్టు శిక్షణలో శిక్షణ పొందిన మహిళలను ఆదుకోవాలని ఉద్దేశంతో లయన్స్ క్లబ్ లో నుండి కుట్టు మిషన్లు గత నాలుగు సంవత్సరాలుగా అందిస్తున్నామని తెలిపారు. ప్రతి మహిళ సద్వినియోగంచేసుకొని కుటుంబ జీవనోపాధికి తోడ్పడాలని పేర్కొన్నారు ఈ నూతన సంవత్సరం 2026లోకి గురువారం నాడు అడుగుపెడుతున్న లయన్స్ క్లబ్ కుటుంబ సభ్యులకు మండల ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త ఏడాది కొత్త ఆశలు కొత్త కోరికలు కొత్త లక్ష్యాలు కొత్త ఆశయాలు కొత్త నిర్ణయాలు కొత్త వేడుకలు కొత్త ఉత్సాహంతో ప్రజలందరూ కలకాలం ఉండాలని వారు పేర్కొన్నారు ఈ సంవత్సరం ఆనందాలు ప్రతి కుటుంబంలో అభివృద్ధి కాంతులు వెల్లి విరియాలని అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం పదిమల పుష్పలత జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి సభ్యులందరూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్ రావు జిల్లా విజన్ కోఆర్డినేటర్ ఉంద్రు శ్యాంబాబు జోన్ చైర్మన్ చింతోజు నాగేశ్వరరావు క్లబ్బు మహిళా కోఆర్డినేటర్ మాదినేని సునీతఎల్ సి ఐ ఎఫ్ కోఆర్డినేటర్ చింతలపూడి వెంకటేశ్వరరావు క్లబ్బు వైస్ ప్రెసిడెంట్ రంగా సత్యనారాయణ లయన్స్ క్లబ్ సభ్యులు మాదినేనిదుర్గాప్రసాద్ నల్లమోతు లక్ష్మీనారాయణ సాయిబాబా మందిరం కమిటీ కోశాధికారి లగడపాటి బోస్ తదితరులు పాల్గొన్నారు

## జక్కంపూడి విగ్రహానికి పూలమాలు వేసిన సర్పంచులు






**తల్లాడ/జనవరి1(జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామపంచాయతీలో నూతన సంవత్సరసందర్భంగా ప్రియతమ నాయకుడుఎ జక్కంపూడి కృష్ణమూర్తి విగ్రహం దగ్గర పూలమాల ఏసి నివాళులర్పించి కేక్ కటింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగినది. బిల్లుపాడు సర్పంచ్ వె నీ క కృష్ణవేణి రామచంద్రాపురం సర్పంచ్ తోట రామారావు, బిల్లుపాడు అభిమానులు కార్యకర్తలు నాయకులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగినది .జక్కంపూడి కృష్ణమూర్తి ఆశయాలు సాధిస్తాం అని ఆయన చేసిన అభివృద్ధి కార్యక్రమాలు మేము ఎన్నటికీ మరువబోము అని బిల్లుపాడు ప్రజలు మహిళలు ఎంతో కృషితో ఈ యొక్క నూతన సంవత్సరం పండుగను ఇలాగే మరెన్నో జరుపుకోవాలని సూచించారు.

# తాగారు.. ఊగారు!




## కొత్త సంవత్సరం సందర్భంగా మందేసి చిందేసిన భారతీయ యువత

- పూటుగా మద్యం తాగి రోడ్ల మీద హల్‌చల్
- తూలుతూ తూగుతూ వాంతి చేసుకుంటూ..
- గుర్గావ్‌లో రోడ్లపై యువతీయువకుల అవస్థలు
- మందు ఎక్కువై స్పృహకోల్పోయిన పలువురు
- దేశవ్యాప్తంగా పలు నగరాల్లో ఇవే దృశ్యాలు
- రాష్ట్రంలో రికార్డుస్థాయిలో మద్యం అమ్మకాలు
- 3 రోజుల్లో దాదాపు రూ.వెయ్యి కోటు
- హైదరాబాద్‌లో 'ఈగల్' తనిఖీల్లో నలుగురు డీజేలు సహా ఐదుగురికి గంజాయి పాజిటివ్
- మూడు కమిషనరేట్ల పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌లో 2731 మంది మందుబాబుల పట్టివేత
- ఏపీలో 3 రోజుల్లో రూ.500 కోట్ల లిక్కర్ సేల్స్




**జనవరి1(జర్నలిస్ట్ వార్త):**
**(-హైదరాబాద్, సిటీ, అమరావతి)**

పూటుగా తాగేశారు! తప్పతాగి తూలుతూ తూగుతూ నడవలేక నానా అవస్థలూ పడ్డారు! ఒళ్లు తెలియనంతగా తాగేసి.. తాగిందంతా లోపల్నుంచి తన్నుకొస్తుంటే వాంతులు చేసుకుంటూ నడిరోడ్లపై సొమ్మసిల్లిపడిపోయారు! ఒకరో ఇద్దరో చేతులు పట్టి నడిపిస్తే తప్ప నడవలేనంతగా తాగారు!! డ్రగ్స్, గంజాయి మత్తులో ఊగిపోయారు!! ఇదీ.. దేశవ్యాప్తంగా యువత నూతన సంవత్సర వేడుకలను జరుపుకొన్న తీరు! ఢిల్లీ నేషనల్ క్యాపిటల్ రీజియన్‌లో భాగమైన గుర్గావ్‌లో, ఇండియన్ సిలికాన్‌వ్యాలీగా పేరొందిన బెంగళూరులో, మన హైదరాబాద్‌లో.. అక్కడా ఇక్కడా అని లేదు.. ఆడా, మగా తేడా లేదు.. దేశవ్యాప్తంగా పలు నగరాల్లో డిసెంబరు 31 అర్ధరాత్రి సమయంలో ఎక్కడ చూసినా ఇవే దృశ్యాలు కనిపించాయి! 'నైట్‌లైఫ్ క్యాపిటల్ ఆఫ్ ద ఢిల్లీ-ఎన్సీఆర్ రీజియన్'గా పేరొందిన గుర్గావ్‌లోని సెక్టార్ 29లో, బెంగళూరులోని కోరమంగళ ప్రాంతంలో పలువురు యువతీయువకులు తూలుతూ నడుస్తున్న దృశ్యాలు, పబ్బుల నుంచి బయటికొచ్చి నడవలేక ఫుట్‌పాత్‌లపై కూర్చుండిపోయిన దృశ్యాలు, తామేం చేస్తున్నారో కూడా తెలియని స్థితిలో ఒళ్లుమరిచి వికృత విన్యాసాలు చేసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. మద్యం అమ్మకాల్లో తెలంగాణ రికార్డు సృష్టించింది. నూతన సంవత్సరం మొదటి రోజునే.. రూ.700 కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. 2024 డిసెంబరు నెలలో ఎక్సైజ్ శాఖకు వచ్చిన ఆదాయం రూ.3805 కోట్లు కాగా.. 2025 డిసెంబరులో ఆ ఆదాయం ఏకంగా రూ.5051 కోట్లకు చేరింది.నాదీచీ ఛానల్ ఫాలో అవ్వండి2025 డిసెంబరు 29న రూ.283 కోట్ల ఆదాయం రాగా.. 30వ తేదీన రూ.375.71 కోట్లు, 31న రూ.282.20 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ మూడు రోజులూ కలిపి దాదాపు రూ.971 కోట్లు. జనవరి 1 అమ్మకాలు కూడా కలిపితే దాదాపు రూ.1671 కోట్లు అవుతుంది! కాగా.. తెలంగాణ వ్యాప్తంగా జరిగిన మద్యం అమ్మకాలు ఒకెత్తయితే.. ఒక్క గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జరిగిన విక్రయాలు ఒక ఎత్తని, డిసెంబరులో ఈ పరిధిలో రూ. 2,020 కోట్లలో మద్యం విక్రయాలు జరిగాయని ఆబ్కారీ శాఖ అధికారులు తెలిపారు. డిసెంబరు 29, 30, 31 తేదీల్లోనే గ్రేటర్ హైదరాబాద్‌లో రూ. 397 కోట్ల మద్యం విక్రయాలు జరిగినట్లు చెప్పారు. దీనికితోడు.. హైదరాబాద్‌లో పబ్బులు, బార్లు ప్రత్యేక ఆఫర్లతో ఆకట్టుకోగా.. వివిధ సంస్థలు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, హైటెక్ సిటీ, మాధాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్ తదితర ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో భారీ ఈవెంట్లను నిర్వహించాయి. హైటెక్ సిటీలోని శిల్పారామం ఎదురుగా గల హైటెక్ ఎరీనాలో ఒక ప్రముఖ సంస్థ ఏర్పాటు చేసిన భారీ ఈవెంట్లో యువత వేలాదిగా సందడి చేశారు. అక్కడ పెద్ద ఎత్తున మద్యం పారింది. యువతీయువకులు ఫుల్లుగా తాగి డీజే పాటలకు చిందులేశారు. అటు ఏపీలోనూ నూతన సంవత్సరం సందర్భంగా మద్యం ఏరులై పారింది. డిసెంబరు చివరి మూడురోజుల్లో రూ.543 కోట్ల విలువైన మద్యాన్ని షాపులు, బార్ల లైసెన్సీలు ప్రభుత్వం నుంచి కొనుగోలు చేశారు. అందులో అత్యధిక భాగం డిసెంబరు 31, జనవరి 1 తేదీల్లో విక్రయించారు. కాగా నిరుడు నూతన సంవత్సరం సమయంలో ఏపీలో రూ.331 కోట్ల అమ్మకాలు జరిగాయి.తాగి వాహనాలు నడుపుతూ..న్యూ ఇయర్ సందర్భంగా.. ట్రై కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ పోలీసులు అడుగడుగునా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో-120, సైబరాబాద్‌లో 100, రాచకొండలో 100 స్పెషల్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఈ తనిఖీల్లో మొత్తం 2731 మంది మందుబాబులు తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. అలా దొరికిపోయిన 1198 మంది మందుబాబులతో హైదరాబాద్ టాప్‌లో నిలవగా.. సైబరాబాద్‌లో 928 మంది, రాచకొండలో 605 మంది డ్రంకెన్ డ్రైవ్‌లో పోలీసులకు చిక్కారు. వీరిలో 21-30 ఏళ్ల యువకులే అధికంగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.గంజాయి మత్తూ..నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఈగల్ బృందాలు నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో డ్రగ్ టెస్టుల్లో నలుగురు డిస్క్ జాకీలు (డీజే) సహా మొత్తం ఐదుగురికి గంజాయి పాజిటివ్‌గా తేలింది. 15 ఈగల్ బృందాలు, 8 ఎక్సైజ్ బృందాలు, స్థానిక పోలీసీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించిన ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టాయి. పబ్బులు, రిసార్టులు, ఫామ్ హౌసుల్లో జరుగుతున్న వేడుకల్లో నిషేధిత గంజాయి, మత్తు పదార్థాలు వినియోగిస్తున్నారన్న సమాచారం వచ్చినచోట తనిఖీలు చేపట్టారు. 89 మందికి డ్రగ్స్ కిట్లతో పరీక్షలు నిర్వహించగా... వేర్వేరు పబ్బుల్లో డీజే ఆపరేటర్లు శ్రీధర్, డేవిడ్, తన్వీర్ సింగ్, డ్రమ్మర్ మణిభూషణ్‌తోపాటు రవికిరణ్ అనే ప్రైవేటు ఉద్యోగికి గంజాయి పాజిటివ్ వచ్చింది. ఈగల్ సిబ్బంది వీరిని అదుపులోకి తీసుకున్నారు.మద్యం అమ్మకాల్లో తెలంగాణ టాప్‌నిమిషానికి 95 మద్యం సీసాల అమ్మకం93 సీసాలతో 2వస్థానంలో ఏపీనూతన సంవత్సర వేడుకల సందర్భంగా దేశవ్యాప్తంగా మద్యం అమ్మకాల్లో.. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఏపీ తొలి రెండు స్థానాల్లో యూపీకి చెందిన ఆర్థిక సేవల సంస్థ 'ఫింటెలెక్ట్ ఇండియా' తెలిపింది. ఆ గణాంకాల ప్రకారం.. తెలంగాణలో న్యూ ఇయర్ నేపథ్యంలో నిమిషానికి 95 మద్యం సీసాలు అమ్ముడుపోగా, 93 సీసాలతో ఏపీ రెండో స్థానంలో ఉంది. తర్వాతి స్థానాల్లో కర్ణాటక (74), మహారాష్ట్ర (41), ఉత్తరప్రదేశ్ (28), ఢిల్లీ (28), రాజస్థాన్ (22) ఉన్నాయి.

# నూతన సంవత్సర వేడుకలు: చర్చిల్లో ఆధ్యాత్మిక సందడి

## మంచి జీవితం కోసం విశేష ప్రార్థనలు -ప్రేమసేవే నిజమైన మార్గంపాస్టర్ సుమన్



నూతన సంవత్సర కేక్ కట్ చేస్తున్న నల్లబెల్లి పాస్టర్ సుమన్, సంఘ పెద్దలు







బట్టలు పంపిణీ చేస్తున్న సంఘ పెద్దలు








**వర్ధన్నపేట/జనవరి1(జర్నలిస్ట్ వార్త):** నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వర్ధన్నపేట మండల వ్యాప్తంగా ఉన్న చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. న్యూ ఇయర్ సందర్భంగా విశ్వాసులు కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద సంఖ్యలో చర్చిలకు తరలివచ్చారు. గత ఏడాది ఎదురైన కష్టాలు, బాధలను తలచుకుంటూ, 2026 సంవత్సరం శాంతి, సుఖసంతోషాలు, ఆశలు, విజయాలతో నిండాలని దేవునిని వేడుకున్నారు. చర్చిలన్నీ భజనలు, ప్రార్థనలు, బైబిల్ పఠనాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.నూతన సంవత్సరం తొలి గంటల నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, ధ్యాన కార్యక్రమాలు కొనసాగాయి. విశ్వాసులు తమ కుటుంబాల సంక్షేమం, పిల్లల భవిష్యత్, ఆరోగ్యం, ఉపాధి అవకాశాల కోసం ప్రార్థనలు చేశారు. కొత్త సంవత్సరం మంచి మార్గాన్ని చూపాలని, జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావాలని దేవునిని వేడుకున్నారు.ఈ సందర్భంగా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామంలో ఏక్లేషియా పెంతకొస్తూ చర్చి లో పాస్టర్ సుమన్ ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితంలో ఆశలు, మార్పులు తీసుకురావాలని ఆకాంక్షించారు. మంచి జీవితం గడపాలంటే ప్రేమ, సహనం, క్షమాశీలత, సేవాభావం అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత స్వార్ధాన్ని విడిచిపెట్టి సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు.ప్రత్యేక ప్రార్థనల్లో కుటుంబ సంక్షేమం, యువతకు మంచి భవిష్యత్, ఉద్యోగావకాశాలు పెరగాలని, రైతులకు పంటలు సమృద్ధిగా పండాలని విశ్వాసులు ప్రార్థించారు. పేదలు, అనాథలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి దేవుని కృప లభించాలని వేడుకున్నారు. దేశంలో శాంతి భద్రతలు నెలకొని, ప్రజలంతా ఐక్యతతో జీవించాలని ఆకాంక్షించారు.చర్చిల్లో నిర్వహించిన బైబిల్ పఠనాలు, ప్రత్యేక సందేశాలు, భజన కార్యక్రమాలు విశ్వాసుల్లో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని పెంచాయి. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఆనందంగా గడిపారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా చీరెలు పంపిణీ చేశారు. చిన్నారులు ఆటపాటలతో అలరించారు. కేక్ కట్ చేసి శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రేమ గా మహా ఆనంద చేస్తూ ప్రమ ఆప్యాయతలు కనపరుచుకొన్నారు.కత్రీ యాల గ్రామంలో.....నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పాస్టర్ శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మార్కెట్ చైర్మెన్ నరకుడు వెంకటయ్య, కాంగ్రెస్ నాయకులు హాజరైన నూతన సంవత్సర కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరణ చేస్తారు. ప్రమ ఆప్యాయతలు కనపరుచుకొంటూ ముందుకు సాగాలని యేసు క్రీస్తు చూపిన మార్గంలో నడుచుకోవాలని పిలుపు నిచ్చారు పాస్టర్ శ్యామ్ సుందర్ కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ చైర్మెన్ నరకుడు వెంకటయ్య మాట్లాడుతూ సర్వ మతాలు సమానంగా ఉండాలని రేవంత్ సర్కారు ప్రజా పాలన అమలులోకి తీసుకు వచ్చారనీ గుర్తు చేశారు. నూతన సంవత్సరం లో యేసు దయతో ప్రజలంతా సుఖ శాంతులతో ఉండాలని కోరుకొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంగ పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.















క్యాత్రియల గ్రామంలో పాస్టర్ శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

# కూనమల్ల నరేష్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన పేరెంట్స్ కమిటీ సభ్యులు

### నిరుపేద కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం

### అంబేద్కర్ యువజన సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు, సీనియర్ పేరెంట్స్ కమిటీ సభ్యులు మాంకాల యాదగిరి

**గీసుకొండ/జనవరి1(జర్నలిస్ట్ వార్త):**వరంగల్ జిల్లా గీసుకొండ మండలం బోడ్డు చింతలపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబశీ కూనమల నరేష్ అనారోగ్యంతో మరణించగా నరేష్ పదవరోజు కార్యక్రమానికి పర్వతగిరి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతున్న కూనమల సహస్ర (9వ), మేఘన (7వ) తరగతి చదువుతున్న విద్యార్థులను పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ గోగుల లావణ్య, కమిటీ సభ్యులు మేకరి మల్లికార్జున్, గజవెల్లి స్వప్న, రంజిత్, ఇల్లందుల శంకర్, తనుగుల శ్రీవిద్య, ఆరురి అశోక్, మాశీకాల యాదగిరి లు రూ. 3500 ఆర్థిక సహాయాన్ని అందించి కుటుంబానికి ప్రగాడసానుభూతి తెలియజేయడం జరిగింది, భవిష్యత్తులో పిల్లల చదువు విషయంలో సహాయ సహకారాలు అందిస్తామని, దోహదపడదామని, మనోధైర్యం తెలియజేయడం జరిగింది, అనంతరం నరేష్ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించడం జరిగింది



## నెలరోజుల పాటు రోడ్డు భద్రతా మాసోత్సవాలు పోస్టర్‌ను ఆవిష్కరించిన పొన్నం



యాదాద్రి **జనవరి1(జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో నెల రోజుల పాటు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు–2026 కొనసాగుతాయని రోడ్డు రవాణా శాక మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.
యాదగిరి గుట్టలో నేటి నుంచి ప్రారంభం కానున్న జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు 2026 పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రతి పౌరుడు రోడ్డు భద్రత మాసోత్సవ అవగాహన సదస్సులో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖ సమన్వయంతో ప్రతి విద్యార్థి దగ్గర, వారి తల్లిదండ్రుల నుండి రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తామనే హామీ పత్రం తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి పాఠశాల రోడ్ సేఫ్టీ క్లబ్‌లో చేరాలని సూచించారు. భవిష్యత్ అంతా రోడ్ సేఫ్టీ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈ ప్రయత్నం జరుగుతుందని వివరించారు. నిన్న రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ అధికారులు విడుదల చేసిన నివేదికల్లో అనేక మరణాలు రోడ్డు ప్రమాదాల వల్లే జరుగుతున్నాయని, అందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రవాణా శాఖ పక్షాన తెలంగాణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ హనుమంతరావు , రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.